# వెలుగు

రచన:
శ్రీ ఎస్. ముద్దుకృష్ణ.

ఆ వీధిలో అది పెద్దమేడ. ఒక యువకు డెవరికోసమో అడుగగా ఆ మేడ చూపించారు. అతను గుమ్మందగ్గర కెళ్ళి కాలింగ్ బెల్లు నొక్కాడు. ఒక అరవైఏళ్ళ వృద్ధుడు వచ్చి తలుపుతీశాడు.

మీరేనాండీ గోపాలరావుగారు, అని అడిగాడా యువకుడు.

అవును, నీ వెవ్వరవు నాయనా, అన్నారు గోపాలరావుగారు.

నేను రాజారావుగారి అబ్బాయినండీ.

రాజారావుగారి అబ్బాయివా? నీ పేరు శేఖరం కదూ! నిన్ను చాలా చిన్నప్పుడు చూసానోయ్. మీ నాన్నతో బాగా స్నేహముంది. కాని మేము కలుసుకొని చాలా రోజులయింది. సర్లే, లోపలికి రావోయ్, అన్నారు.

శేఖరం లోపల కెళ్ళబోయాడు. అంతలోనే ఆ వీధిలోనే అలజడి రేగింది. ఎవరో గోలచేస్తున్నారు. ఒక పిచ్చివాడు పరుగెత్తుకొచ్చాడు. గోపాలరావుగారిముఖం లోకి చూసి వెర్రిగా నవ్వుతూ, నా రాణీనేం చేసావు? ఏది నా రాణి? నా రాణి కులాసాగా వుందా? ఆ... వెళ్ళిపోతున్నావా రాణీ... నేనూ వస్తున్నాను, అని అంటూ ఎలా వచ్చాడో అలాగే పరిగెత్తిపోయాడు. గోపాలరావుగారి ముఖం తేజోవిహీనమయింది. పాత స్మృతులు ఏదో ఆయన మనసులో చెలరేగి అలజడి చేసినవి. మనసులోని భావాలు ముఖంలోంచి బాధగా బయటపడ్డాయి. కళ్లు చెమ్మగిల్లాయి. కళ్ళు వత్తుకుంటూ లోపలికి రా బాబు అన్నారు లోపలికి దారితీస్తూ. అది చూసి శేఖరం ఆశ్చర్యపోయాడు. అసలు సంగతేమిటో తెలుసుకోవాలనే ఆతృత నణుచుకుంటూ లోపలికెళ్లాడు శేఖరం. ఇద్దరూ కుర్చీల్లో కూర్చున్నారు. శేఖరం ఆతృత నాపుకోలేకపోయాడు. కాని ఎలా అడగాలో తెలియలేదు. ఇందాక వచ్చిన పిచ్చివాడ్ని చూసి ఎందుకంత బాధపడుతున్నారో నేను తెలుసుకోవచ్చా, అన్నాడు వీలైనంత నెమ్మదిగా.

కాసేపటిదాకా నిశ్శబ్దం ఆవరించింది, తరువాత నిట్టూరుస్తూ, అదంతా ఒక విషాదగాథ నాయనా. నాకు ధనధాన్యాలు వున్నా ఆత్మశాంతి, ఆనందం అనేది అలభ్యమయి పోయాయి. సరే, నాకు కూడా కొంత మనశ్శాంతి లభిస్తుంది. అంతా చెప్తాను విను, అన్నాడు. బాధతో గూడుకట్టుకొన్న ఆయనహృదయం శేఖరం చూపిన కాస్త ఆత్మీయతకే కరిగిపోయింది.

* * *

నా కొక చెల్లెలుండేది. అది పుట్టిన సంవత్సరం లోపలే మా అమ్మ చనిపోయింది. మా నాన్నగారు మళ్ళీ పెళ్ళి చేసుకోకుండా మమ్మల్ని ముద్దుగా పెంచేరు. మాకు చాలా ఆస్తివుండటంవల్ల నేను చదువు పూర్తయిం తర్వాత మా నాన్నగారిలా మా ఫ్యాక్టరీ వ్యవహారాలు చూసుకోవడం మొదలుపెట్టేను. మా చెల్లికి ఒక మంచి సంబంధం చూసి పెళ్ళిచేసాను. మా నాన్నగారు పోయాక ఇంటిపెద్దను నేనేకదా. కాని విధి దండన విధిస్తే ఎదురీదే వారెవరు? ముచ్చటగా మూడు సంవత్సరాలన్నా గడవకుండ తన జ్ఞాపకార్థము ఒక కొడుకు నిచ్చి మా చెల్లెని విధవను చేసిపోయాడు. కొడుకు రాజాతో ఆమెవచ్చి నాతోనే యిక్కడుంటుండేది. నా కళ్ళెదుటే నా ప్రియమైన తల్లిదండ్రులు పోయారు. ప్రేమతో పెంచిన చెల్లెలి పసుపుకుంకమలు పోయాయి. జీవితమంటే నిరాశ, విరక్తి, అసహ్యం కలిగాయి. కాని చెల్లి బలవంతంమీద నేను పెళ్ళిచేసుకున్నాను. నాభార్య వచ్చింది. నా జీవితంలో నూతనోత్సాహాలు తొణికిసలాడాయి. రెండేళ్ళలో నా కొక చక్కని పాపని ప్రసాదించింది. రాణి అని పిల్చేవాళ్ళం. చెల్లికి పిల్లలిద్దరితోనే పొద్దుబోయేది. వాళ్ళిద్దరిని చూసి మురిసిపోయేది. పిల్లల్ని చూసి అంతా, ఈడూ జోడూ అని మురిసే వాళ్ళం. సంసారం సాఫీగా సాగిపోతూంది.

చిన్నప్పటి ఆటలలోనుంచి పిల్లలిద్దరి మధ్యా అనురాగం పెంపొందింది. వాళ్ళిద్దర్నీ చూస్తే ముద్దొచ్చేది. అప్పుడప్పుడు ఆటలలో ఇద్దరికీ దెబ్బలాట వచ్చి అలిగి కూర్చునేవాళ్ళు. చెల్లి వెళ్ళి ఇద్దరినీ సముదాయించి సమాధాన పరిచేది. ఇద్దరూ స్కూలుకు కలిసే వెళ్ళేవాళ్లు.

రాజా ఇంటరు పాసయ్యాడు. అప్పుడది ఫోర్తుఫారం కాబోలు చదువుతుండేది. రాజా ఎం. బి. బి. యస్ చదువుతానని పట్టుబట్టేడు. వాడికి వైజాగ్‌లో సీటు వచ్చింది. తరువాత చెల్లిని, వాడ్ని తీసుకెళ్ళి వైజాగ్‌లో ఇల్లుచూసి అన్నీ అమర్చివచ్చాను. వాడి చదువు చక్కగానే సాగింది. ఒకసారి శెలవులకు మా యింటికి వచ్చారు.

ఒకరోజు సాయంకాలం తోచక మా తోటలోకలా షికారెళ్ళాను! పక్షుల సందడి మధ్య ఎక్కడనుంచో రెండుగొంతులు విన్పించాయి. ఎవరని వెళ్ళి చూసాను. రాజా - రాణి ఇద్దరూ మాట్లాడుకుంటున్నారు. నాకెందుకో వాళ్ళమాటలు వినాలనిపించింది. వాళ్ళక్కన పడకుంటా దాక్కున్నాను. నేను చేస్తున్నది తప్పని తెలిసినా ఆ క్షణంలో అలా చేయాలనిపించింది,

బావా, నీ వెక్కడబాబు ఎం. బి., బి. యస్. వి ఐపోతావు.

ఆ తరవాత మే మసలు కన్పిస్తామా? అంది.

నేనెంత ఎం. బి., బి. యస్. నైన నీవాడనే గా, అన్నాడు.

పో, బావా నీ వెప్పుడూ ఇంతే, అంది.

నేను ఎం. బి., బి. యస్, నైతే ఏమంటానో గానీ నీ విప్పుడే పొమ్మంటున్నావు. బలేదానివి, అన్నాడు.

అది కాదు బావా అంది.

ఏది కాదు మరదలా అన్నాడు.

నేను చెప్పను పో. నీకు ప్రతీదానికి వేళాకోళమే అంటూ అలుక నటించింది.

కాసేపు బ్రతిమాలి, ఆడవాళ్ళకు అలుకే అందం అలుకతోనే మగవాళ్ళ మెప్పు తేలిగ్గా పొందేస్తారు. మొత్తంమీద ఆడదానివనిపించుకున్నావు. నీ చెప్పాలనుకున్నదేమిటో నాకు తెలిసిపోయిందిలే, అన్నాడు.

ఎలా తెలిసింది బాబూ, అంది.

నీ హృదయంలో సంగతి నాకెలా తెలిసిందనా ఆశ్చర్యపోతున్నావు. నీ హృదయం నే నెప్పుడో దొంగిలించేసానుగా. నా సొత్తు ఐపోయింది. అంటూ నవ్వాడు.

ఐతే నువ్వు దొంగగా కూడా తయారవుతున్నావన్న మాట.

దొంగిలించడమే కాకుండా అది నాదే అని దబాయిస్తున్నావే. హక్కుదారై యిస్తే పుచ్చుకున్నాను. అది దొంగతన మెలా అవుతుంది.

ఐనా నా హృదయం నువ్వు దోచుకేదా అన్నాడు.

ఎప్పుడు బాబూ అంటూ పక్కకు తిరిగి నవ్వుకుంది.

రాణీ, నువ్వు మాటలు బాగా నేర్చుకున్నావే అన్నాడు.

నువ్వు మాత్రం తక్కువ తిన్నావా అంది.

ఇలాంటి ఎదురు సమాధానాలు చెప్పేదాన్ని కట్టుకొని నేనేమి సుఖపడతాను! ఇలాంటి గయ్యాళివద్దు బాబోయ్ అన్నాడు బెట్టుసరిగా.

అలాగయితే నేను మాట్లాడనంటూ మూతిబిగించింది.

హా...మాట్లాడవా రాణీ...వలపుల పూబోణి...నా హృదయ వీణావాణి...అక్కటా ఏమని చెప్పుదు నా బాధ. నీకై సతతము తపించు నాపైనా నీకీ అలుక. కావవా దేవీ...కరుణించవా రాణీ అంటూ రాణీ గడ్డం పట్టుకొని నాటకం స్టైలులో మాట్లాడటం మొదలు పెట్టేడు.

మూతి బిగపట్టుకున్న రాణీ నవ్వేసింది. రాజాకూడా నాటకం స్టైలు మానేసి తనూ నవ్వేసాడు.

* * *

నేను ఇవతలకు వచ్చేసాను. నాకు వారిద్దరూ రెండు ప్రేమ జ్యోతుల్లా కనిపించారు. ఇద్దరూ కలసి అఖండ జ్యోతిగా వెలగాలని ఉర్రూతలూగుతున్నారు, అటువంటివారిని విడదీయగూడదనిపించింది. వారి పవిత్ర ప్రేమ చూసి పెళ్ళి చేసేయ్యాలనిపించింది. దీనివల్ల అందరికీ ఆనందం కలుగుతుందనిపించింది. నా మనసంతా ఏదో మధురానుభూతులతో నిండిపోయింది.

నేను తరువాతంతా ఈ విషయం గురించి ఆలోచించాను. ఎందుకైనా మంచిదని చెల్లెలితో కదిపిచూసాను. వాళ్లు చిన్నప్పటినుంచి అనుకుంటున్నదేగా. పిల్లలు గూడా ఇష్టంగా వున్నట్లు కన్పిస్తున్నారు. ఇంక మనదేముంది. వచ్చేఏటితో వాడి ఎం, బి. బి. యస్ పూర్తవుతుందిగా...ఆ తరువాత చేసేద్దాం. అయినా నువ్వు అవునంటే నే నెప్పుడన్నా కాదంటానా అంది. సంవత్సరం వాయిదా వెయ్యడం అనవసరమనిపించింది నాకు. ఐనా ఓపికపట్టాను, సంవత్సరం గడచింది. చెల్లి రాజా

వచ్చారు. నేను పిల్ల పెద్దదయిపోతుండంటూ పెళ్ళి విషయం కదిపాను. చెల్లీ, వాడు ప్రాక్టీసు పెడతానంటున్నాడు. ప్రాక్టీసు పెట్టినాక పెళ్ళిచేసుకుంటాడట, అన్నది.

వాడి కెందుకు ప్రాక్టీసు. మన ఫ్యాక్టరీ వ్యవహారాలు చూసుకుంటే చాలదా, మనకు డబ్బుకేమైనా లోటా అన్నాను.

వాడు చదివిన చదువును సద్వినియోగం చేస్తానంటున్నాడు. అని అంది.

పోనీ ప్రాక్టీసు పెట్టుకోనీ, పెళ్ళయిం తరువాత ప్రాక్టీసు పెట్టుకుంటాడంటూ బలవంతం చేసాను!

ఎవ్వరూ ఎదురుచెప్పలేదు. పెళ్ళి వైభవంగా జరిపించాను. డాక్టరు కోర్సు పూర్తయినాకా కె. జి. హెచ్ లో ఉద్యోగం ఇచ్చారు రాజాకు. వైజాగ్ లోనే కాపురం పెట్టారు. అమ్మాయి కాపురానికి వెళ్ళాక నా కెంతో మనసు మూగపోయింది. నా భార్య పరిస్థితి నా కంటే అధ్వానం అయింది. ఇల్లు చూస్తున్న కొద్దీ మేమిద్దరమూ ఒంటరిగా మిగిలిపోయామేమోననిపించింది.

ఒకసారి అమ్మాయిని చూడడానికి వెళ్ళాం. అప్పుడు నా మనస్సు మహదానందం పొందింది. వాళ్ళ జీవితంలో నూతన కాంతులు విరజిమ్ముతుండేవి. రాణీయే వంటంతా చేసేది. ఎందుకమ్మా అంత కష్టపడుతున్నావు వంటమనిషిని పెట్టుకోకూడదా అని ఎవరన్నా అంటే నా భర్తకు నేనుచేస్తే తప్పేమిటి అన్నట్లుగా నవ్వి వూరుకొనేది. రాజా వంటలో సహాయం చేస్తానని వచ్చేవాడు హుషారుగా. మీరువెళ్ళి మీపని చూసుకోండి. నా కిందులో ఆనందం లభ్యమవుతుందనా మీకీ అసూయ అనేది నవ్వుతూ. రాజా నవ్వేసి వెళ్ళిపోయేవాడు. వాళ్ళ నవ్వుల్లో పువ్వులు విరజిమ్ముతున్నట్లుండేది నాకు. జీవితమంతా వాళ్ళను చూస్తూ కూర్చుంటే చాలనిపించేది. అతను ఆస్పత్రినుండి సాయంకాలం వచ్చేవాడు. అప్పుడిద్దరూ కలసి షికారుకో, సినిమాకో వెళ్ళేవారు. వాళ్లలో ఆనందం అనురాగం తప్ప చీకూ, చింత అనేవి అసలు కనిపించేవి గావు. చెల్లీ నీ కొడుకును, కోడల్ని చూసి మనస్సులో ఆనందపడి తిరిగివచ్చాము.

ఒకరోజు నేను కూర్చుని ఏదో ఆలోచిస్తున్నాను. అమ్మాయి వ్రాసిన ఉత్తరం అప్పుడే అందింది. తీసి చదువుకున్నాను, అందులో చెల్లి మేడమెట్లనుంచి జారి పడిందని-జ్వర మొచ్చిందని - లేవలేని స్థితిలో వుందని అందరిని చూడాలంటుంది గావున రమ్మనివుంది. నా హృదయంలో కలతరేగింది. తలిదండ్రులు పోయారు. ఉన్న ఒక్క తోబుట్టువు మంచంమీద వుండనగానే మనసు విలవిలలాడింది.

తొందరగా ప్రయాణమై వెళ్ళాము.

చెల్లి లేవలేని పరిస్థితిలో వుంది. సన్నగా చిక్కిపోయింది. చాలా బాధగా మూలుగుతోంది. ఆమెను చూడగానే నా మనస్సు చివుక్కుమంది. మాకు దూరమైపోతుందేమో అన్న సంశ కలిగింది. నేను దగ్గరకి వెళ్ళాను. నన్నుచూసి మాట్లాడబోయింది. కాని నీరసం వల్ల బాగా మాట్లాడలేకపోయింది. వంట్లో యిప్పుడెలా వుందని అడిగాను.


మీ వ్యవసాయాభివృద్ధికి...




Manufacturing: 1 H.P. To 20 H.P. Motors
1 H.P. To 10 H.P. Monoblock Sets.

Branch: 296, Thambu Chetty St., Madras-1

(Sole Distributors for Andhra Pradesh Except the Districts of Cudappa and Chittoor) M/s. Standard Commercial Corporation, Pitchiah Street, Labbipet, Vijayawada-2.

Chittoor Agents: M/s. Sivaraj Electricals.

వంట్లో ఎలావుంటే యేం...ఇవాళో...రేపో... పోయేదానికి. మా వాళ్ళ నలుగురిమధ్య పోతున్నానన్న సంతృప్తి నాకుంది...వాడికో నలుసు కలిగితే చూద్దామనుకున్నాను...ఎవరికెంత...ప్రాప్తమో...అంతే మరి అంది.

అదేమిటమ్మా అలా మాట్లాడతావు. నీకు నయమవుతుందని డాక్టరు చెప్పేరుగా అన్నాడు ప్రక్కన కూర్చొన్న రాజా.

వేరే డాక్టరుని పెట్టేవా? అన్నాను.

అవును. అతను ఫారను రిటర్న్, బాగా అనుభవం వున్నవాడు. మంచిదని తీసుకొచ్చానని అన్నాడు.

రాజా, పాపం రాత్రింబగళ్లు శ్రమపడ్డాడు. ఎప్పుడూ మంచందగ్గరే కూర్చొనేవాడు. చిన్నప్పటినుంచి ఆ తల్లిని విడిచిపెట్టి వాడు ఎప్పుడూ వుండలేదు. ఆ తల్లి మంచం మీద వుండేసరికి భరించలేకపోయాడు. అసలే వాడి హృదయం అతి సున్నితం. అందుకే వాడా చిన్నదెబ్బకు తట్టుకోలేక పోయాడు. వాడలా బాధపడుతుంటే అమ్మాయి మరింతగా మనసులోనే బాధపడుతుండేది. ఆ యిల్లు కష్టాలకు ప్రతిరూపంగా వుంది. క్రిందటిసారి వచ్చినపుడు సంతోషనిలయంలా వుంది ఈ యిల్లేనా అనిపించింది.

ఆ సాయంకాలం చెల్లికి చాలా సీరియస్‌గా వుంది. దానితో రాజా బాగా గాభరాపడి డాక్టరుకి ఫోను చేశాడు. ఆయనెక్కడకో వెళ్ళిపోయాడని తెలిసింది. రాజాయే ఒక ఇంజక్షను యిచ్చాడు. దాంతో నెమ్మదించి నిదురపోయింది. రాత్రి చాలాసేపటివరకు రాజా మేలుకొనే వున్నాడు. తెల్లవారింతర్వాత లేచి చూస్తే ఇంకేమున్నది నాకున్న ఒక్క తోబుట్టువు లేకుండా పోయింది. నాకిలాంటి బాధలు చిన్నప్పటినుండి అలవాటైపోయాయి గనుక నేను ఓదార్చుకోగలిగాను. రాజామాత్రం బాగా షాక్ తిన్నాడు. చిన్నప్పటినుంచి పెంచిన తల్లిమీద ప్రేమ దాదాపు అతడ్ని పిచ్చివాడ్ని చేసింది. వెర్రి చూపులు చూస్తూ కూర్చొనేవాడు. తల్లిని తల్చుకొని తపించిపోయేవాడు. రాజా చేత సెలవు పెట్టించి అందరినీ తీసికొని ఇక్కడకి వచ్చేశాను. కానీ వాడు మాత్రం మారలేదు. వాడి హృదయం నవనీతం కన్న సున్నితమైనది. దానికి తగిలిన వజ్రఘాతాన్ని వాడు భరించలేకపోయాడు. అమ్మాయి కూడా చాలా బాధపడింది. రాజాను విడచి ఒక క్షణంకూడ వుండేదికాదు. వాడా బాధ మరచిపోయేందుకు సర్వ ప్రయత్నాలు చేసింది. మాటలతో కవ్వించి నవ్వించేది. ఇద్దరూ తోటలోకివెళ్ళి కూర్చొనేవారు. ప్రకృతే వాళ్ళని ఓదార్చేది. కాలం గతాన్ని కొంత మరచిపోయేట్లు చేసింది. కొన్నాళ్ళకు రాజా మామూలు మనిషిగా మారాడు. తను తిరిగి వైజాగ్ వెళతానన్నాడు. మే ముందగా ఎందుకులే నాయనా మా కళ్ళముందే వుండండి అన్నాను. నేర్చుకున్న విద్యను వృధా చేయకూడదని చెప్పి భార్యతో సహా వెళ్ళిపోయాడు. తరువాత అమ్మాయి వుత్తరం వ్రాసింది. ఆయన తిరిగి మామూలుగా సరదాగా వుంటున్నారని. నేను చాలా సంతోషించాను.

కొంతకాలం గడిచింది. అమ్మాయి కడుపు ఫలించిందని, వాళ్ళ దాంపత్యఫలం వెలుగొందబోతుందని తెలిసింది. అమ్మాయిని తీసుకొద్దామని వెళ్ళాను. అమ్మాయిని తీసుకు వెళ్ళడానికి వచ్చానని చెప్తూ ఇద్దరినివచ్చి సరదాగా రెండురోజులు గడపమన్నాను. రాజా రెండు రోజులకైతే రావడానికభ్యంతరం లేదన్నాడు. కాని అమ్మాయిని అక్కడే హాస్పటల్లో చేర్పిస్తానన్నాడు. మొదటికాన్పు పుట్టింటిలో పొయ్యాలని వొప్పించి ఇద్దరిని తీసుకువచ్చాను. రెండురోజులు సరదాగ గడిచాయి రాణీని జాగ్రత్తగా చూసుకోమని ప్రసవించిన వెంటనే తనకు టెలిగ్రాం యివ్వమని మరీ మరీ చెప్పి వెళ్ళిపోయాడు. రాజాలో వున్న ప్రేమంతా రాణీమీద కేంద్రీకరించబడింది అపుడు.

* * *

ఇంకా తెల్లవారలేదు. మసకమసకగా చీకటి వుండగానే లేడీ డాక్టరిని నౌకరు తీసుకొచ్చాడు. సూర్యోదయ సమయంలో నా మనవడు పుట్టాడు. నా వంశంలోనే సూర్యుడు పుట్టాడా అన్నంత సంతోషం కలిగింది నాకు. ఆ ఆనందంలో ఏమి చేయాలో కూడా తోచలేదు. నా భార్య చెప్పేవరకు రాజాకు టెలిగ్రాం యివ్వాలన్న సంగతి కూడా మరచిపోయాను. టెలిగ్రాం యిచ్చిన మరునాటికల్లా రాజా వచ్చేసాడు. అతడి కళ్ళల్లో తండ్రినయ్యాననే గర్వం ఆనందం తొణికిసలాడుతూ కన్పించాయి. తల్లికి పిల్లాడికి అవి తెప్పించండి

(తరువాయి 19వ పేజీలో)

(10వ పేజీ తరువాయి)

ఇవి తెప్పించండి అని నానాగాభరా చేసేవాడు. మా యిల్లు నిలబెట్టేవాడు పుట్టాడని మాయింటిలోని అందరి హృదయాలు సంతోషంగా నాట్యాలు చేసాయి.

మూడురోజులు ముచ్చటగా గడిచాయి. నాల్గో నాడు అమ్మాయికి కొద్దిగా జ్వరమొచ్చింది. రాజా వుండిపోయి మందులు అవీ తనే యిచ్చాడు. ఇంకొద్దిగా జ్వరమెక్కువయిందిగాని తగ్గలేదు. వారంరోజులు గడిచాయి. ఫారిను తిరిగివొచ్చిన ఒక డాక్టరును తీసుకువచ్చాం. ఆయన చూసి ఇంజక్షను యిచ్చాడు. ఆవేళ సాయంకాలం చాల సీరియస్‌గా వుంది. డాక్టరుకి ఫోను చేశాం. డాక్టరు వచ్చి ఇంజక్షను యిచ్చాడు. రాత్రి గడుస్తే ఫరవాలేదు. మీరు జాగ్రత్తగా చూస్తూండండి. నాకు కొద్దిగాపనుంది. వస్తాను అని రాజాకు చెప్పి వెళ్ళిపోయాడు. రాణీ మగతగా వున్నట్లుంది. ఏమిటేమిటో కలవరిస్తోంది. రాత్రి పదకొండుగంటలు దాటి ఉంటుంది. అంతా జాగరం చేస్తున్నాం. వెర్రికేక వేసింది. అంతే చలనం లేదు. రాజా ఆత్రుతగా కుదిపాడు దేహాన్ని. వాడి హృదయంలో అగ్నిపర్వతాలు బ్రద్దలయాయి. ఆ బాధ భరించలేకపోయాడు. పిచ్చెక్కినట్లు మంచానికి తల బాదుకున్నాడు. మొహం నిండా రక్తం కారుతోంది. మే మాపలేకపోయాం వాడ్ని. ఏడుస్తున్నవాడల్లా గబుక్కున వెర్రిగా నవ్వేడు. రాణీ వెళ్ళిపోతున్నావా? నేనూ వస్తానుండు. అంటూ పైకి చూసుకుంటూ పరుగెత్తిపోయాడు. అప్పటినీని చూసికూడా నే నిలాగ బ్రతికగలిగానా అని ఆశ్చర్యమేస్తుంది. అర్ధరాత్రి సమయం చిన్నపిల్లాడు ఏడుస్తున్నాడు. ఇంక దొరకని తల్లిపాల కోసం - కన్నకూతురు చచ్చిపడుంది. దూరాన కుక్కలు ఏడుస్తున్నాయి - అల్లుడు పిచ్చెత్తి పారిపోతున్నాడు. అంతా చూస్తూనే వున్నాను, నాకు చావురాలేదు. నాకు పిచ్చెక్కలేదు. నా మనసు మొద్దుబారిపోయింది, జరుగుతున్నదంతా తెలుస్తున్నా నాకు స్పృహ లేదు. అలా ఆస్థితి గడిచిపోయింది. ఆ బెంగతో నా కష్టాల్లో పాలుపంచుకొనే నాభార్యకూడా ఆరునెల్లు తిరక్కుండా నన్ను అన్యాయం చేసిపోయింది.

నేమ మాత్రం బ్రతికే వున్నాను జీవచ్ఛవంలా. పిచ్చెక్కినరాజా కనబడలేదు. అతనికోసం నేనుచేసిన ప్రయత్నాలన్నీ వృధా అయ్యాయి. అకస్మాత్తుగా వారం రోజులక్రితం తిరిగి వచ్చాడు. కానీ వాడ్ని ఇక్కడ వుంచలేకపోతున్నాను. ఇందాక చూసావుగా, ఎలాగ వచ్చాడో అలాగే పారిపోయాడు. అందుకని ఏమీ చెయ్యలేక వదిలేశాను. నా జీవితంఅంతా నిరాశం... దుఃఖం - చీకటి. ఈ నిరాశలోనే నాకొక్క ఆశ - ఆ దుఃఖంలోనే నాకొక్క ఆనందం - ఆ చీకటిలోనే నాకొక వెలుగు కిరణం నా మనవడు తల్లి లేనిబిడ్డ. తండ్రి వున్నా లేనిబిడ్డ. వాడ్ని పెంచి పెద్దజేసి నా బాధ్యత తీర్చుకోవాలి, ఈ ముసలివాడు ఆ చిన్న మొక్కకి నీళ్ళు పోసి వేళ్ళు పాతుకొనేటట్లు చేస్తే చాలు. నా జీవితానికదొక్కటే ఆశయం. అదొక్కటే ఆనందం. ఇంత వరకూ భగవంతుడు నన్ను అన్యాయం చేసాడు. ఈ సారి అన్యాయం చేస్తాడని అనుకోను. గోపాలరావు గారు చెప్పడం పూర్తిచేసినా, ఆయన కళ్ళవెంట అశ్రువులు రాలటం మానలేదు.

అంతలో ఒక చిన్నకుర్రవాడు పరిగెత్తుకొచ్చాడు. తాతయ్యా! తాతయ్యా! నాకీ కారొద్దు. ఎగిరే విమానం తాతయ్యా అంటూ వొడిలో వ్రాలాడు. కుర్రవాడు చూడకుండా కన్నీళ్ళు తుడుచుకున్నారు గోపాలరావు గారు.

కథవిన్న శేఖరం హృదయం బరువెక్కింది. సానుభూతిగా ఒక్క నిట్టూర్పు విడిచాడు. అబ్బా యీయనది జీవితమా? కష్టాలకూడులా? ఆప్తులందరు ఈయన్ని చీకట్లో విడిచిపోయారు. అప్పటికీ దొరికిన ఆ కాస్త వెలుగును పట్టు వ్రేళ్ళాడుతున్నారు. నిరాశలో ఆశ, చీకటిలోంచి వెలుగు సృష్టించుకొంటున్న ఆశాజీవి. ఆ ఆశాజీవి జీవితంలో ఆ కాస్తవెలుగు అంతరిస్తే...? అబ్బా ఊహించడానికే భయం వేస్తుంది. ఆ విషయం ఆలోచించటం మానివేసాడు శేఖరం. ఆ తరువాత తను వచ్చిన పని చూసుకు వెళ్ళిపోయాడు తనదారిని తాను.

కాని, ఏదైతే శేఖరం వూహించడానికి భయపడ్డాడో అదే జరిగిపోయింది, నిండా మూడునెల్లు గడవకుండా వెలుగు అంతరించిన అంధకారం అనుభవిస్తూ బ్రతుకుతున్నారు, గోపాలరావుగారు.

కథ చదవడం ముగించి, 'ఇదేం కథ? ఇంత దుఃఖపూరితంగా వుంది' అంది సుధ హృదయంలో బాధ మెదుల్తూ ఉన్నట్లు,

ఇది కథకాదు. కొందరు అదృష్టహీనుల జీవితం. దౌర్భాగ్యులు వాళ్లకు జీవితంలో అంతాదుఃఖమే. అంతా ఆవేదనే. వాళ్ళగూర్చి మనం వింటేనే ఎంతోబాధ కలుగుతుంది మనకు ఇష్టం లేకపోయినంత మాత్రాన అది మారదు. సృష్టిలో యీ విచిత్రం అర్ధంకాదు. ఈ కథ చదివినవారు, అలాంటి దౌర్భాగ్య జీవితాలు తల్చుకొని ఒకక్షణం ఆలోచించగలిగితే, రెండు కన్నీటిబొట్లు రాల్చగలిగితే, యీ కథ వ్రాయటంలో నా కోరిక నెరవేరినట్లే' అన్నాను నేను.